

# బక్రి

‘ఇస్‌కు మౌత్ నహీ ఆరీ’ అని పొద్దున లేస్తూనే అనుకుంటది జహీరాబి షోహర్‌ను చూసి. ఇలా గత ఆర్నెల్ల నుంచి రోజుకు కనీసం ముప్పైసార్లయినా అనుకుంటుంది. ఇప్పుడే లేచింది కాబట్టి లేస్తూనే ‘ఇస్ కు మౌత్ నహీ ఆరీ’ అనుకుంది మేక ముందు కూర్చొని వున్న షోహర్‌ను చూస్తూ.

జహీరాబీకి పెళ్లయి తొమ్మిదేండ్లయినా కాలేదు, ఏడుగురు పిల్లల తల్లి. పిల్లగానికి పిల్లగానికి కనీసం సంవత్సరమైనా ఎడంలేదు. అట్లంటే చాలా అన్యోన్యమైన దాంపత్యమని, భార్యాభర్తలిద్దరు చిలకాగోరింకల్లా ముద్దు ముచ్చట్లతో సుఖవంతమైన జీవితాన్ని గడుపుతున్నారనుకోవడానికి లేదు. ముగ్గురు బిడ్డలు, నలుగురు కొడుకులు. ఎప్పుడు కడుపులో నలుసు పడుతుందో తెలీదు. ఆమెకు

ఇన్ని ప్రెగ్నెన్సీలు ఎలా వచ్చాయో తెలీదు. కొంచెం తెలిసిందనుకొనేసరికి డెలివరీ రోజులు దగ్గరపడేవి. ఇదే మొదటిసారి ఓ పిల్లగాడు పుట్టిన తర్వాత ఇప్పటి వరకు ప్రెగ్నెన్సీ రాకపోవడం. పాలు తాగుతున్న చివరి పిల్లగాని వయసు ఏడునెలలు. ఆరు నెలలుగా శారీరక దాడి తక్కువగా జరుగుతుంది జహీరాబికి. ఎందుకంటే ఆరునెలల నుంచి ఒక మేకను తెచ్చి పెంచుతున్నడు భర్త యాకూబ్‌మియా.

యాకుబ్‌మియా సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించిన ఒక కంపెనీలో డ్రైవర్. ఇరవై మూడు సంవత్సరాలకే పెళ్లయిన యాకుబ్‌మియాకు ఇప్పుడు ముప్పై రెండేండ్లు. మనిషి చూడ్డానికి నలభై ఏండ్ల వాడనిపిస్తాడు. ఇంట్లో వున్నంతసేపు భార్యను తిట్టుకుంటూనో, కొడుతూనో, ఏదో ఒక లొల్లి చేస్తూనే వుంటాడు. పిల్లల్ని తిట్టడం, కొట్టడం ఆయనకో అలవాటు. ఇదొక సామ్రాజ్యమనీ, ఈ సామ్రాజ్యానికి తానే షహేన్‌షా అన్నట్లుంటుంది యాకూబ్‌మియాకు. ఒక మాట చెప్పిం తర్వాత కూడా తన పనికాలేదో ఇంట్లోనే ఓ నరకాన్ని సృష్టిస్తాడు. అన్నీ అలవాటు చేసుకుంది జహీరాబీ. శారీరక, మానసిక నరకాల్ని అనుభవిస్తున్న జహీరాబీ భర్తలో లేదనుకున్న ప్రేమను, దయాగుణాన్ని ఈ మధ్యనే చూస్తోంది. అదీ ముఖ్యంగా యాకుబ్‌మియా తాను పెంచుతున్న ఒక మేక మీద ఇవన్నీ చూపించడం. దీన్ని భరించలేకపోతుంది జహీరాబి.

మేకే లోకమైపోయింది భర్తకు. మేకకోసం ఇంటికి తొందరగా వస్తున్నాడు. వస్తూ వస్తూ మేక కోసం కూరగాయలు, చెట్ల ఆకులు మొదలైనవి తీసుకొని వస్తున్నాడు. అన్నం తింటాడో లేదో క్షణాల్లో నిద్రపోయే భర్త ఇప్పుడు నిద్రంతా వొదిలిపెట్టి మేక ముందు కూర్చుంటున్నడు. అర్ధరాత్రో, తన కిష్టమైనప్పుడో, కావాలనుకున్నప్పుడో ఒక బరువుగా తన మీదపడి పాకులాడే యాకుబ్‌మియా ఒకవేళ నిద్రపట్టకపోతే రాత్రంతా మేక ముందు కూర్చొని దానికి ఒక కథ చెప్తున్నట్లుగా ఏవేవో కబుర్లు చెప్తున్నాడు.

మేకల మీద, జంతువుల మీద, మనుష్యుల మీద మొదటి నుంచి వేటి మీద ప్రేమ లేదు యాకుబ్‌మియాకు. మగాడన్న ఒకే ఒక అహం. ఎలాంటి మార్పులేని తన వృత్తిలాగే ఇల్లు కూడా గడుస్తుందనుకుంటాడు యాకుబ్‌మియా. పిల్లల్ని దగ్గరికి తీసుకొని నాలుగు మాటలు చెప్పడం, వాళ్లతో ఆడుకోవడం, వారంలో ఏదో ఒకరోజు వాళ్లని అలా బయటికి తిప్పిరావడం, ఇంటికి వస్తూ వస్తూ జహీరాబీకి మల్లెపూలు తీసుకురావడం బహుశా ఇవేవీ తెలియవు యాకుబ్‌మియాకు. కనడం తప్ప పిల్లల్ని ముద్దుచేసి పెంచడం యాకుబ్‌మియాకు తెలియదు. ఇంట్లో యాకుబ్‌మియా వున్నంతసేపు ఆయన రాజ్యం. ఆయన వెళ్లిన తరువాత పిల్లల రాజ్యం.

* * *

ప్రేమగా చూసుకుంటున్నాడు కాబట్టే మేకకు నా భర్తంటేనే ఇష్టం. దాని ముందు కూరగాయలు, ఆకులు, నీళ్లు పెట్టాలి. దాన్ని మార్చి మార్చి రెండు మూడు దిక్కుల కట్టాలి. ఎవరూ కనపడకపోతే మే...మే... అని అరుస్తుందది. మొదట్లో మేకను సరిగ్గా చూసుకోలేదని, దానికి నీళ్లయినా పెట్టలేదని, దాన్ని ఎడాపెడా కొడుతున్నామని మమ్మల్ని కొట్టేవాడు యాకూబ్‌మియా. ఆయనకు ఎప్పుడెందుకు కోపం వస్తుందో తెలీదు. ఆయనకు కోపం రావడానికి కారణం మేకే అయ్యేది. రోజురోజుకు ఈయన మీద ఏర్పడే కసి మేక మీద కూడా పెరగుతోంది.

మేక నుంచి కదలలేక కదలలేక దాన్ని వదలలేక వదలలేక వదిలి వెళ్లిపోతుంటాడు యాకుబ్‌మియా బయటికి. మేక కోసమే ఇంటికి వచ్చినట్టుగా వస్తడు. ఇంటికి వచ్చిండో లేడో దాన్ని పేరు పెట్టి పిలుస్తాడు. ఇక దానితోటి మాటలు. అది తోకాడిస్తుంది. మూతితో ఒళ్లంతా నాకుతుంది. ఒక్కొక్క కూరగాయని ముక్కలు ముక్కలుగా కోసి దానికి తినిపిస్తాడు. 'ఏం తిన్నావు పొద్దుటి నుంచి' అని మనిషిని అడిగినట్లు అడుగుతడు.

కుండలోని మంచినీళ్లను తీసుకొచ్చి దానికి తాగిపిస్తాడు. అది యాకూబ్‌మియా చుట్టూ గుండ్రంగా తిరుగుతుంది. తలాడిస్తుంది. కాసేపు కూర్చుంటుంది. కాసేపు పడుకుంటుంది. బొర్లుతుంది. గిట్టల్ని అతని గుండెలమీద పెడుతుంది.

డ్యూటీ నుంచి వచ్చిన తర్వాత ఛాయ్‌చేసి పిలిచినా దగ్గరికి రాడు. వేడినీళ్లు మరిగిమరిగి చల్లారిపోతాయి. అన్నం కూడా మేక వద్దకే తీసుకుపోయి తింటాడు. మొదట్లో ఈ చేష్టలన్నీ చూసి పిచ్చిలేచిందేమో అనుకునేదాన్ని. రేపటి నుంచి ఈ కుటుంబమెట్లా నడవాలి అనుకునేదాన్ని. ఈ మనిషికి మేక రోగం రాలేదు కదా అనుకునేదాన్ని. ఏ మనిషైనా కనీసం ప్రేయసితోనైనా ఇట్లా ప్రవర్తిస్తాడా అనుకునేదాన్ని.

వాడంతా జహీరాబీ భర్త మేక మనిషై పోయాడనుకునే వాళ్లు. రోజూ ఇలాగే ప్రవర్తిస్తే పిచ్చోడైపోతాడనే వాళ్లు. ఎన్ని తిట్లు తిన్నవో, ఎన్ని దెబ్బలు తిన్నవో...పోతే పోనీ, నీకు కష్టాలు తప్పినయ్ అని నాకు చెప్పేటోళ్లు. కొందరు కావాలనే మీ మేకెలా వుందని మా అయననొచ్చి అడిగేవాళ్లు. ఈయనకో సంబురం. వాళ్లను కూచోపెట్టి, వాళ్లకు ఛాయ్ ఇచ్చి 'దీనికి నా భాషంతా తెలుసు' అనేటోడు. మేకను మెచ్చుకోడానికి ఆయన దగ్గర పదాలు లేకుండేవి. 'మేకల్లో మంచి మేక' అని చెప్పేటోడు. రాత్రంతా మే...మే... అని అరుస్తుంది. నువ్వు పంటే లేవవు. పాపం మేకకు ఏమయ్యిందో, ఏమోనని బాధ అన్పించింది. అందుకే మేకను చూసి పోదామని వచ్చినం అని ఈయనను ఆటపట్టిస్తూ చెప్పేవాళ్లు. ఇక చుట్టాలైతే 'బక్రా బన్‌గయా తేరా షోహర్' అనేటోళ్లు.

'ఇస్‌కో మౌత్ నహీ అతీ' కాబట్టి బక్రికో 'మార్‌డాల్‌నా' అనుకునేదాన్ని. 'తాడు తెంపితే ఎటైనా పారిపోద్ది - పీడా పోద్ది' అనుకునేదాన్ని. మల్లా యాకూబ్‌మియా కోపం గుర్తొచ్చి నా కసిని అణుచుకునేదాన్ని.

ఇదివరకటిలా ఇప్పుడు బజారుకు పోవడానికి లేకుంట అయ్యింది. పాలు తాగే పిల్లగాన్నికూడా వదిలి మార్కెట్‌కెళ్లి సామాను తెచ్చుకునేదాన్ని. ఇప్పుడు ఇంటికి తాళమేసి మేకను వదిలి బయటికి పోయేటట్టు లేదు. ఆయన డ్యూటీకి పోయిన తర్వాత పిల్లలు కూడా మేకకు అలవాటైపోతున్నారు. ఈ మేక ఎక్కడి నుంచొచ్చిందో, ఈయన ఎందుకిట్లా మారిపోయిండో ఓ పట్టాన అర్థంకాక పోయేది. 'కోయి కర్త్‌వా' అనేవాళ్లు. 'తాయత్తు కట్టిద్దునా, దువా చదివిద్దునా' అనిపించేది మనసుకు.

'నలభై ఎనిమిది గంటల బంద్' అని పనికి పోయేది లేదని యాకూబ్‌మియా ఇంట్లోనే వున్నడు. వాడలో వుండే నలుగురైదుగురు సాయిబులు బయట బజార్ల పరిస్థితి బాగలేనందున ఈయన దగ్గరికొచ్చి ముచ్చట్లు పెడుతాండ్రు. అందరికి ఛాయ్‌లు ఇయ్యమంటే నేను ఛాయ్‌లు చేస్తున్నాను. 'దేఖో యాకూబ్‌మియా, 'అచ్చా పాలా ఇస్‌కో...కాటేతో పంద్రాకిలో గోష్ నికల్‌తా' అన్నాడొక సాయిబు. 'బక్కగా వుండే నువ్వు తెచ్చినప్పుడు. ఇప్పుడు సూడు గాయ్‌కే జైసా హువా' అన్నాడింకొక సాయిబు. 'గీ బంద్ గిప్పుడే వచ్చింది. ఏమైనా చేద్దామంటే పనే లేకపాయే. పోగులు ఏసుకొని మంచిగా దావత్ చేసుకుందాం పట్టు' అన్నాడొక సాయిబు. 'ఎన్ని రోజులు పెంచినా కోసుడే కదా! ఎప్పుడు కోత్తే ఏంది. ఇప్పటికే ముదిరింది' అన్నాడింకొక సాయిబు. ఛాయ్ తెచ్చి అందరికి ఇచ్చుకుంటూ ఇవ్వాళ పెద్ద గొడవే అయ్యేటట్టుంది ఇక్కడ అనుకుంటాన మనసులో. 'వచ్చినోళ్లు నన్నేమైనా అన్నా పడ్తాడేమో కానీ నా మొగుడు మేకను అంటే వూరుకోడు' అన్పించింది.

'చూడు యాకూబ్‌మియా! మనకు రాక రాక వచ్చింది ఇటువంటి టైం. నలభై ఎనిమిది గంటలు. మనం ఇంట్ల వుండేటోళ్లమేనా? బయటికి పోయేటట్టు లేదు పరిస్థితి. 'మన సిలార్‌మియా ఇంటికి కొత్తల్లుడు, బిడ్డ వచ్చిండ్లు. రోగమో, గాయమో లేని మంచి బక్రి ఇది. తలకాయ, కాళ్లు నువ్వే వుంచుకో. అందరం సమానంగా కుప్పలేసుకుందాం పట్టు' అన్నడు రహీంఖాన్.

'కుప్పలేసుకుందామంటే పెద్ద పని. కసాబు రావాలె, కొయ్యాలే. అందరం పంచుకోవాలే. ఇదంతా ఇవ్వాలైతదా? మల్లా కసాబు వున్నడో లేడో' అన్నడు యాకూబ్‌మియా. 'కసాబు లేకపోతే పోనీ, కసాబు పని నాకు రాదా ఏందీ? అందరి

షాదీ బారాత్‌లల్ల నేను చేత్తలేనా ఏందీ? నువ్వు దాని గురించి ఫికర్ చెయ్యకు. నేను ఇప్పుడే పోయి ఛురీకుంద తీసుకుని వస్తా' అంటూ అక్కడినుండి లేచి మహ్మద్‌మియా వాళ్లింటికి పోయిండు.

మా ఆయన నెత్తికి టోపీ పెట్టిండు. బక్రీకి మూడుసార్లు 'బిస్మిల్లా' అని నీళ్లు తాగించిండు. బక్రీని పడుకోబెట్టి ఒక చేతితో దాని నాలుగు కాళ్లు, ఇంకో చేత్తో గొంతు దగ్గర పట్టుకున్నడు. మహ్మద్‌మియా 'బిస్మిల్లా' అని 'హలాల్‌నామా' చదివి బక్రి గొంతు హలాల్ చేసి దూరంగా జరిగి కత్తి కడుక్కుంటాండు.

పిల్లలంతా ఏడుస్తూ కూర్చున్నరు. అమ్మీ! 'బక్రీకో మార్‌డాలే, బక్రీకో మార్‌డాలే' అంటాంది చిన్నబిడ్డ.

నేనిదంతా నాకలలో జర్గుతాందే అనుకుంటున్న తప్ప యాకూబ్‌మియే ఇట్ల చేసిండనుకుంటలేను. బక్రీని చెట్టుకు వేలాడదీసి దాని చమ్డా తీస్తాండ్లు. 'మంచిగ తియ్ మహ్మద్‌మియా, లేకుంటే డబ్బులు రావు' అంటాండు యాకూబ్‌మియా.

'బక్రికి వచ్చింది మౌత్, వీనికి రాకపాయే' అంటాంది నా మనసు. 'ఇంతకాలం దాన్ని పెంచి, దానికోసం మమ్ముల్ని కొట్టి, దానితో ముచ్చట్లాడింది ఎందుకో నాకర్థమే కాలేదు. పిల్లల్ని కొట్టినంత సింపుల్‌గా, నన్ను తన్నినంత సింపుల్‌గా బక్రిని సంపేసిండు యాకూబ్‌మియా'.

ఇల్లంతా మేక వాసన వస్తోంది. నిద్ర పట్టుతలేదు. ఈ రోజు రెండు పూటలా బిర్యానీ తిన్న యాకూబ్‌మియాకు నా అవసరం గుర్తొచ్చింది. నిద్రపోయినట్లున్న నా మీద రోడ్డు మీద లారీ బరువులాగా బరువేసిండు యాకూబ్‌మియా. నా కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. మళ్లీ ఎప్పుడు నెల తప్పుతానో తెల్వదు.

'కథా పత్రిక' ప్రత్యేక కథల సంచిక - 2001
తేజ - తెలుగు వీక్లి - మార్చి - 27 - 2009
వంశీకి నచ్చిన కథలు - ప్రత్యేక కథల సంపుటి - 2009